క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



నర్సంపేట : విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కందగట్ల టాకరాజు, కల్వచర్ల ప్రవీణ్‌చారి, బలభక్తుల బ్రహ్మాచారి, కోమండ్ల ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా గడ్డం దయాకర్



చెన్నారావుపేట : స్థానిక ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ గడ్డం దయాకర్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ గోవిందరావు ఉద్యోగ విరమణ చేసిన క్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమిస్తూ జెడ్పీ సీఈఓ రాంరెడ్డి ఆదేశాల జారీ చేయడంతో దయాకర్‌ను బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా దయాకర్‌ను ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

ఘనంగా దాటుడు పండగ



రాయపర్తి : మండలంలోని దుబ్బతండాలో తండావాసులు మంగళవారం దాటుడు (సీత్లా భవాని) పండగను ఘనంగా నిర్వహించారు. సీత్లాభవాని మాతకు మొక్కులు చెల్లించారు. పంటలు సమృద్ధిగా పండడంతోపాటు కుటుంబాలు ఆయురారోగ్యాలతో తులతూగాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేదావత్ కమల వెంకన్న, నాయకులు సోడియ రాణియా, సోడియ ఆసియా, డి.సురేశ్, తార్‌సింగ్ భద్రయ్య, డి.కృష్ణ, ఎస్.సురేశ్, రామచంద్రు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

రాయపర్తి (వర్ధన్నపేట) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాలకు చెందిన గజవెల్లి బన్ని, దుప్పెల్లి అఖిల్ వర్ధన్నపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వరంగల్‌కు చెందిన మహ్మద్ సొహెల్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బన్ని, అఖిల్ గాయాలపాలయ్యారు. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. బన్ని తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శ



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్‌లోని ధర్మారం గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబును, అతడి సోదరుడు రమేశ్‌ను వారి తల్లి ఎల్లమ్మ ఇటీవల మృతి చెందిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు మంగళవారం పరామర్శించారు. తొలుత ఎల్లమ్మ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ జంగారెడ్డి తనయుడు సత్యపాల్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా కార్యాలయ కార్యదర్శి క్రాంతికుమార్, నాయకులు జాటోతు శ్రీనివాస్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి

నల్లబెల్లి : గత ప్రభుత్వ హయాంలో మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మాణ పనులు మంజూరు చేసి ఎనిమిది నెలలు గడుస్తున్నా అధికారులు పనులు ప్రారంభించడం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఆర్థికసాయం

తొర్రూరు : జర్నలిస్టు బోగోజు సురేశ్ ఆర్నెళ్ల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబానికి స్థానిక ఎస్సై జగదీష్ మంగళవారం రూ.5 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై రాంజీ నాయక్, ఏఎస్సై రవీందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు సాయికిరణ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

అన్నారంలో భక్తులకు ఇబ్బందులు

● రోడ్డు పొడవునా వెలుస్తున్న దుకాణాలు



రోడ్ల మీదకు వచ్చిన దుకాణాలు

పర్వతగిరి : మండలంలోని ప్రముఖ యాత్రా స్థలమైన అన్నారంలో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామంలోని యాకూబ్ షావలీ దర్గా ఎదుట ఉన్న రోడ్లు దుకాణాలతో నిండిపోతున్నాయి. ఫలితంగా భక్తుల రాకపోకలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతీ శుక్ర, ఆదివారాల్లో భక్తుల రాక ఎక్కువగా ఉంటుండడంతో దుకాణదారులు తమ షెటర్లు దాటి రోడ్డుపైన దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భక్తులు రాకపోకలు సాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేయకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

రోడ్లపై దుకాణాలను తొలగించాలి



అన్నారం యాకూబ్ షావలీ దర్గా దర్శనానికి వచ్చే సమయంలో రోడ్లపై దుకాణాలు వెలుస్తున్నాయి. దుకాణాలు అడ్డంకిగా ఉండడంతో దర్శనానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయంలో దుకాణదారులకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలి. తద్వారా దుకాణాలను తొలగించి భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

-హరీశ్, భక్తుడు

రోడ్డుపై ఏర్పాటు చేయకుండా చర్యలు



అన్నారం దర్గాకు వచ్చే భక్తులకు, రాకపోకలు సాగించే వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే అనేక చర్యలు చేపట్టాం. ఇక నుంచి వ్యాపారస్తులు రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేయకుండా అవగాహన కల్పిస్తాం. దుకాణాదారులు రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

-గుగులోతు వెంకన్న, ఎస్సై

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న రైతు మురళి

ఖానాపురం : మండల కేంద్రంలోని రైతు వేదికలో స్థానిక సొసైటీ ఆధ్వర్యంలో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్ అన్నమనేని రవీందర్‌రావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన పదెకరాల్లోపు భూమి ఉన్న అన్ని వర్గాల రైతులకు రైతు భరోసా కల్పించాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. దబ్బీర్‌పేట, మంగళవారిపేటలో ఏజెన్సీ ప్రాంతాల రైతులకు న్యాయం చేయాలని సూచించారు. రైతు మల్లారెడ్డి మాట్లాడుతూ రైతు భరోసాను తొలగించి ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని చెప్పారు. రైతులు అశోక్, ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ పంటలు సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా కల్పిస్తే బాగుంటుందన్నారు. రైతులు మురళీ, ప్రసాదరావు మాట్లాడుతూ గతంలో ఇష్టారాజ్యంగా రైతుబంధు ఇచ్చారని ఆరోపించారు. ప్రస్తుతం ఐదు నుంచి పది ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలన్నారు. ఈ క్రమంలో మరో రైతు మౌలానా అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంపై అభాండాలు వేయొద్దన్నారు. రైతు బంధు సక్రమంగానే మంజూరైందని తెలిపారు. ఈ క్రమంలో రైతుల మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. ఎంపీపీ ప్రకాశ్‌రావు, అధికారులు కలుగజేసుకుని వాగ్వాదాన్ని వారించారు. రైతుభరోసాపై అభిప్రాయాలు సేకరించడానికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఇతర అంశాలు వద్దని నచ్చజెప్పారు. ఇతర రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. సమావేశంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఇన్‌చార్జ్ ఏడీఏ నగేశ్, కోఆపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ విలమ, ఏఓ శ్రీనివాస్, ఏఈఓలు నాగరాణి, సంతోశ్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతుల హాజరు నామమాత్రమే..

ప్రభుత్వం రైతు భరోసా అమలు కోసం రైతుల అభిప్రాయాన్ని సేకరించేందుకు ఏర్పాటు చేసిన సమావేశానికి రైతులు నామమాత్రంగా హాజరయ్యారు. అధికారులు సమావేశానికి ఆలస్యంగా హాజరు కాగా కొందరు రైతులు మాత్రమే రావడం చర్చనీయాంశంగా మారింది. హాజరైన రైతుల్లోనూ పలువురు అభిప్రాయాలను అంతంతమాత్రంగానే వెల్లడించారు.

వనమహోత్సవానికి ఏర్పాట్లు చేయండి



పర్వతగిరి : మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్

పర్వతగిరి : నేటి (బుధవారం) నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో వనమహోత్సవాన్ని విజయవంతం చేయడానికి ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ శంకర్ ఆదేశించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐకేపి సీసీలు, వీఓఏలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ షెడ్యూల్ ప్రకారం వన మహోత్సవ కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో కనీసం వెయ్యి సీడ్ బాల్స్ తయారు చేయించి 5న మెగా ప్లాంటేషన్ చేపట్టాలని చెప్పారు. గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాలు, గుట్టల వెంట సీడ్ బాల్స్ వేయాలని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీడీ సుశీల్‌కుమార్, ఏపీఎం కృష్ణమూర్తి, ఈసీలు, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండల పరిషత్ నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ అరుంధతి మాట్లాడారు. గ్రామాల వారీగా నర్సరీల్లో ఉన్న మొక్కల సంఖ్య, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల పరిధిలో నాటాల్సిన మొక్కల వివరాలను ఆయా శాఖల బాధ్యులకు వివరించారు. అన్ని గ్రామాల్లోనూ వన మహోత్సవాన్ని సమర్థవంతంగా నిర్వహించే దిశగా ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఏఓ దయాకర్, ఏపీఓ శ్రీనివాస్, ఎంపీఎం రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గడ్డం దయాకర్ మాట్లాడారు. వన మహోత్సవంలో ప్రజలను భాగస్వాములను చేయాలని చెప్పారు. విరివిగా మొక్కలు నాటాలని చెప్పారు. నాటిన మొక్కలను సంరక్షించేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ అంబటి శ్రీధర్‌రాజు, ఏపీఓ అరుణ, ఏపీఎం ముక్కెర ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టాలి



రాయపర్తి : వినతిపత్రం ఇస్తున్న నాయకులు



రాయపర్తి : వర్ధన్నపేటలో..



దుగ్గొండిలో..

రాయపర్తి (వర్ధన్నపేట) : ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీకి వెంటనే చర్యలు చేపట్టాలని బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాపాక ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఈ మేరకు వర్ధన్నపేట తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇకనైనా నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు చెంగల సురేశ్, నాయకులు శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ మోర్చా పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ ఎనగందుల శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. నిరుద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. స్వరాష్ట్ర ఏర్పాటు నుంచి నిరుద్యోగ యువత మోసాలకు గురవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. గత బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలకు నిరుద్యోత యువతపై చిత్తశుద్ధి లేదన్నారు. కాంగ్రెస్ సైతం మోసపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, రాపాక ప్రశాంత్, మంచాల సుమన్, జక్కుల సందీప్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ రవిచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు సందీప్‌కుమార్, ఎడ్ల శశిధర్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ తయారీలో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చెన్నారావుపేట : ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలో భాగంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కాప్స్ (ఎన్జీసీ), జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టర్ తయారీ పోటీలో మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని దాక్షాయణి ప్రతిభ కనబర్చిందని ప్రధానోపాధ్యాయురాలు జయ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. అనంతరం హెచ్‌ఎం జయ మాట్లాడారు. వరంగల్‌లో పోటీలు నిర్వహించగా దాక్షాయణి తృతీయ స్థానంలో నిలిచిందని చెప్పారు. ఈ క్రమంలో డీఈఓ వాసంతి నుంచి విద్యార్థి దాక్షాయణి, గైడ్ టీచర్ గజవెల్లి సుందర్ ప్రశంసాపత్రంతోపాటు మెమోంటో అందుకున్నట్లు తెలిపారు. పోటీలో విద్యార్థులు కీర్తన, అక్షిత, సాత్విక, శ్రావణి, శ్రీకర్, పునీత్ పాల్గొని సర్టిఫికెట్లు అందుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోశ్‌కుమార్, బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మాధవి, మొగిలి, రమాదేవి, సతీశ్ కుమార్, స్వప్న, జాహిద్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

హరితహారం



రాయపర్తి (వర్ధన్నపేట) : డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా సేవాపక్షలో భాగంగా వర్ధన్నపేటలో మాజీ ఎమ్మెల్యే, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మంగళవారం హరితహారం కార్యక్రమం చేపట్టారు. తన తల్లి ఎల్లమ్మతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో కొండేటి అనిత సత్యం, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, వర్ధన్నపేట పట్టణ ఉపాధ్యక్షుడు వెలమకంటి గిరిప్రసాద్, కొండేటి ధినేశ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

గీసుకొండ : మండలంలోని గంగదేవిపల్లి, మచ్చాపూర్, కొమ్మాల గ్రామాల్లోని జెడ్పీ హైస్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు అహింస ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం నోట్‌బుక్కులు, పెన్నులు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఫౌండేషన్ ప్రతినిధులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యూసుఫ్, ఫౌండేషన్ ప్రతినిధులు సరిత, కోర్నెల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలంలో 'మన ఊరు-మన ఎమ్మెల్యే'

రాయపర్తి : నేడు మండలంలో 'మన ఊరు-మన ఎమ్మెల్యే' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి మండలానికి వస్తారని చెప్పారు. మండలంలోని రాగన్నగూడెంలో ఉదయం 8:30 గంటలకు వన మహోత్సవంలో పాల్గొంటారని వివరించారు. అలాగే ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ జనరల్‌బాడీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు. పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మహిళా ప్రయాణికులకు బహుమతులు



ప్రయాణికురాలికి బహుమతి అందజేస్తున్న డీఎం

నర్సంపేట : ఆర్టీసీ డీలక్స్ బస్‌లో ప్రయాణం చేసి డ్రాలో ఎంపికైన మహిళలకు స్థానిక డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి మంగళవారం బహుమతులు అందజేశారు. తొలుత పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో లక్కీ డ్రా తీశారు. ఈ సందర్భంగా డీఎం ప్రసూన లక్ష్మి మాట్లాడారు. నర్సంపేట నుంచి ఉప్పల్, ఉప్పల్ నుంచి నర్సంపేట ప్రయాణం చేసి బస్ టికెట్ వెనకాల పేరు, సెల్ నంబర్, అడ్రస్ రాసి లక్కీ డ్రా బాక్స్‌లో వేసిన మహిళా ప్రయాణికులకు డ్రా తీసి ముగ్గురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. నర్సంపేటకు చెందిన చైతన్యకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భవానీ, ఎంఎఫ్ ప్రభాకర్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ నారాయణ, ఈడబ్ల్యూబీ మెంబర్ రవీందర్ పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనతో యువతకు ఉపాధి



పథకాన్ని వివరిస్తున్న జగన్, తదితరులు

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజనతో నిరుద్యోగ యువతకు ఉపాధి లభించనుందని బీజేపీ దుగ్గొండి మండల ఇన్‌చార్జ్ బాల్నె జగన్ తెలిపారు. పట్టణంలోని 13వ వార్డులో మంగళవారం ఆ పార్టీ నాయకులు ప్రజలను కలిసి పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడారు. ప్రధాని మోదీ చేతివృత్తులు చేసుకునే వారికి ఉపయోగపడేలా పథకాన్ని రూపొందించారని చెప్పారు. పథకంలో 18 బీసీ కులాలకు అర్హత కల్పించినట్లు తెలిపారు. ఎంపికైన వారికి 15 రోజులు రోజుకు రూ.500 స్టైఫండ్ ఇస్తూ శిక్షణ ఇవ్వడంతోపాటు వృత్తికి సంబంధించిన రూ.15 వేల విలువైన కిట్ అందజేస్తారని చెప్పారు. పథకాన్ని అర్హులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సామల ప్రవీణ్, దామెర ఆకాశ్, కనుక గణేశ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్‌లో నిబంధనల ఉల్లంఘన



పుస్తకాలను పరిశీలిస్తున్న సీఆర్పీలు, నాయకులు

నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నేపల్లి గ్రామ శివారులోని న్యూ విజన్ స్కూల్‌లో నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ తెలిపారు. ఎంఈఓకు ఫిర్యాదు చేసిన క్రమంలో స్కూల్‌ను సీఆర్పీలు భరత్, శ్రావణ్ మంగళవారం సందర్శించగా పార్థసారథి, నరేశ్ హాజరై మాట్లాడారు. అధిక ధరకు పుస్తకాలు, యూనిఫారం, టై, బెల్టులు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత నోట్‌బుక్‌లు విక్రయిస్తున్న గదిని సీఆర్పీలు సీజ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు స్టాలిన్, నరేశ్, ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుకట్ట మరమ్మతులు ప్రారంభించాలి

● ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : మండల కేంద్రంలో ప్రమాదకరంగా ఉన్న చెరువుకట్టకు మరమ్మతు పనులు వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఆత్మకూరు పెద్దచెరువు కట్ట ప్రమాదకరంగా మారిన విషయాన్ని తెలుసుకున్న ఆయన.. మంగళవారం ఉదయం చెరువుకట్టను పరిశీలించారు. చెరువుకట్ట మొదలు నుంచి చివరివరకు సుమారు 2కిలో మీటర్ల మేర నడుచుకుంటూ పరిశీలించారు. అనేక చోట్ల చెరువుకట్ట కోతకు గురికావడంతో ఆందోళన వ్యక్తం చేశారు. నీటిపారుదలశాఖ ఈఈ సునీత, డీఈ వేణుగోపాల్, ఏఈ జ్యోతిరాణితో చెరువుకట్ట పరిస్థితిపై అక్కడే సమీక్షించారు. రూ.77.40 లక్షలతో గతంలోనే ప్రతిపాదనలు పంపించామని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఫైలు ఉన్నతాధికారుల వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎలాంటి జాప్యం చేయకుండా పనులు ప్రారంభించి వర్షాల ఉధృతి మొదలుకాకముందే పనులు పూర్తిచేయాలన్నారు. చెరువు కట్ట ఎత్తు కూడా పెంచాలని సూచించారు. అలాగే మండలంలోని కటాక్షపూర్ చెరువుతో పాటు పలు చెరువుల్లో అనుమతితో మట్టి తీసినప్పటికీ గుంతలు అలాగే వదిలేసినట్లు తన దృష్టికి వచ్చిందని, మట్టితీసి గుంతలను అలాగే వదిలేసిన వారికి నోటీసులు పంపించి వెంటనే చెరువుల ఉపరితలాన్ని లెవల్ చేయాలన్నారు. కామారం చెరువును కూడా పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంఆర్ఐ రవీందర్, సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, మత్స్యసంఘం చైర్మన్ బయ్య తిరుపతి, కాంగ్రెస్ జిల్లా నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, కక్కెర్ల రాజు, మార్క రజనీకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, బరుపట్ల కిరీటి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాజా, సొసైటీ డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డి, యూత్ కార్యదర్శి తనుగుల సందీప్, నాయకులు వెంకటేశ్వర్లు, ఒడ్డెపెల్లి ప్రసాద్, అలువాల రవి పాల్గొన్నారు.

విశ్వనాథం మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు, ఐఎఫ్‌టీయూ నేత ఎల్.విశ్వనాథం మృతి తీరని లోటని పార్టీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు గట్టి కృష్ణ అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో విశ్వనాథం చిత్రపటం వద్ద నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్, కృష్ణ మాట్లాడారు. సుమారు 40 ఏళ్లుగా పార్టీలో విశ్వనాథం క్రియాశీలకంగా పని చేశారని చెప్పారు. రైతుల, వ్యవసాయ కూలీల, కార్మికుల హక్కుల కోసం నిర్విరామ కృషి చేశారని తెలిపారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తనకు చివరి శ్వాస ఉన్నంత వరకు విశ్వనాథం ప్రజల, కార్మికుల పక్షాన పోరాటాలు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. విశ్వనాథం ఆశయాలను కొనసాగించాలని శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్, పార్టీ నాయకులు అభి, భద్రాజీ, ఎల్లన్న, పాషా, మల్లన్న, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త సెక్షన్ కింద కేసు నమోదు

గూడూరు: కొత్త నేర చట్టాలు మూడు అమల్లోకి వచ్చి రెండు రోజులయింది. అందులో భాగంగా మంగళవారం గూడూరు పోలీసు స్టేషన్‌లో బీఎన్ఎస్ కింద మొదటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్. నగేష్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని తేజావత్‌రాంసింగ్‌తండా శివారు నల్లబోడుతండాకు చెందిన జర్పుల సోమ (38) అదే గ్రామానికి చెందిన భూక్య శ్రీనివాస్ వద్ద కొంత అప్పు తీసుకొన్నాడు. అప్పు తీర్చమని సోమను శ్రీనివాస్ ఇబ్బందుకుల గురి చేశాడు. అవమానంతో భూక్య సోమ పురుగుల మందు తాగి మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, కారకులను శిక్షించాలంటూ తండావాసులు మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్సై నగేష్ చేరుకొని జరిగిన సంఘటన ఫిర్యాదు మేరకు కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చాడు. దీంతో మంగళవారం మృతుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.